# అందని లోతులు

"...వండర్ ఫుల్ టు లుక్ ఎట్" అన్న మాటలు అస్పష్టంగా వినపడితే వెనుతిరిగి చూచింది మాలతి, ఖాళీ ప్లేటుని చేతిలో పట్టుకుని. రమేష్ ముఖంలో ఏమీ చదువలేకపోయింది. పోనీ అతని చూపుల్ని బట్టయినా అంత అందంగా కనబడుతున్న దేమిటో తెలుసుకుందామని ప్రయత్నించింది. బహుశా ఎదుటిగోడ నున్న సీనరీయేమో!...కాని అతని చూపులు అక్కడకూడా లేవు. ఆ సీనరీని, ఆ గోడని చీల్చుకుని బయట వ్యాపించి ఉన్న శూన్యంలోకి చూస్తున్నట్టుగా ఉన్నాయి.

ఏమీ అర్థంకాక "ఏమిటి" అంది మాలతి సందిగ్ధావస్థలో.

"యు ఆర్ వండర్ ఫుల్ టు లుక్ ఎట్" అన్నాడు తాపీగా, కలలో మాట్లాడుతున్నట్టుగ రమేష్. ఈ సారి తృళ్ళిపడి చూచింది అతనివైపు మాలతి. అతని చూపులింకా అన్నింటినీ చీల్చుకుని శూన్యంవైపే కేంద్రీకరించి ఉన్నాయి.

మాలతి అయోమయంగా ప్రక్కగది లోకి వెళ్ళి రమేష్ టిఫిన్ తిని ఖాళీచేసిన ప్లేటును టేబులుమీద ఉంచి, దానిని ఊతంగా తీసుకుని నిలబడి గట్టిగా ఊపిరి తీసుకుంది. ఇంకా అతనికి టీ ఇవ్వాలి. ఎదురుగా వెళ్ళే సాహసం కలగడంలేదు. సరుకులు తేవడానికి బయటకు వెళ్ళిన పనిమనిషి ఇంకా తిరిగిరాలేదు. ఎలాగో ఓ అయిదు నిముషాలకు తనని తాను సంబాళించుకుని టీ కప్పుతో ముందు గదిలోకి వెళ్ళేటప్పటికి.....ఖాళీగది. రమేష్ గుర్తుగా యాష్ట్రే నిండుగా పడిఉన్న సిగరెట్టు పీకలు, అగ్గిపుల్లలు వెక్కిరించాయి మాలతిని. టీ కప్పు పక్కనపెట్టి అక్కడే అలాగే కూర్చుండి పోయింది "ఏమి మనిషి ఇతను" అనుకుంటూ.

"రమేష్‌వచ్చి వెళ్ళాడా" అని సిగరెట్ పీకలవంక చూస్తూ అడిగిన అన్నను చూసి మాలతి మళ్ళీ మామూలు లోకంలో పడింది.

"ఆఁ" అంది మాలతి.

"అప్పుడే వెళ్ళిపోయాడే?....నే నాలశ్యంగా వస్తానన్నానని చెప్పావా?"

లేదన్నట్టు తలూపింది.

"అదేమిటి టీ తాగడం మర్చిపోయి ఆలోచనలో పడ్డావా!... ఏం మళ్ళీ మీ బాస్‌తో తగువు వచ్చిందా ఇవాళ" అన్నాడు నవ్వుతూ అన్న రావు.

రమాదేవి

"ఉహుఁ. నీ స్నేహితుడే తాగకుండా వెళ్ళారు."

"అదేం...అత న్నేమయినా నొప్పించావా? అసలే నీ కతనంటే మంచి అభిప్రాయంలేదు" అన్నాడు ఆత్రుతగా.

"నే నేమీ అనలే దసలు. టిఫిన్ తిన్నారు. టీ తెచ్చేలోపున వెళ్ళిపోయారు..."

''వాడు చాలా సెన్సెటివ్....నువ్వు పొరపాటున కూడా ఏమీ అనకు. నెల రోజులనుంచీ బ్రతిమాలితే నిన్నటినుండీ మనింటిలో భోజనం చేయడానికి ఒప్పుకున్నాడు.''

నీ పిచ్చికాని అన్నయ్యా, నువ్వెంత ప్రయాసపడి ఏం లాభం. అయినా ఆయనకు టీ కాఫీ లేం సరిపోతాయి. బార్‌లున్నాయిగా" అంది తేల్చేస్తూ మాలతి.

"నీకు బాగా నూరిపోసినట్టుంది మీ వదిన. నువ్వనుకున్నంత తాగుబోతేమీకా దతను భార్య పోయినప్పటినుంచీ కొంచెం ఎక్కువ తాగుతున్నాడు."

"ఆవి డ్నేమీ ఇబ్బంది పెట్టేవాడు కాదే. తాగుడు కసలు జీతంలోది ఖర్చు పెట్టేవాడేకాదు..ఇంగ్లీషు మాగజైన్స్‌లో మారుపేర్లతో ఎన్నో వ్రాస్తాడు. వాళ్ళు బాగా డబ్బిస్తారు. అసలు వాడు బార్‌లో వ్రాయడానికే దూరతాడు. ఇటు తాగుతూ ఉంటాడు. అటు వ్రాస్తూ ఉంటాడు. ప్రక్కన నే నుండాలి. లేకపోతే ఎంతో నిస్పృహగా అవుపించి ఏమీ వ్రాయలే నంటాడు."

"అయితే నిన్ను ప్రేమంచేశా డను. ఇంతకీ మీ ఇద్దరిలో ప్రేయసి ఎవరు, ప్రియుడు ఎవరు?" అంది నవ్వుతూ మాలతి.

"అ దింకా తేలలేదు...ఏమయినా వాడిని ఆక్షణాన చూస్తే ఏ స్త్రీ అయినా ప్రేమించి తీరవలసిందే...నా మట్టుకు నాకే ఆక్షణాన అడదాన్నయితే బావుండు ననుకుంటాను'' అన్నాడు రావుకూడా నవ్వుతూ.

"ఏది ఏమయినా వదిన పుట్టింటినుంచి త్వరగా వచ్చేస్తే బావుండును. నాకీ రమేష్ బెడద తప్పేది; అతని సంగతి తనే చూసుకునేది" అనుకుంది మాలతి. అయితే ఆ బెడదను రమేష్ తీర్చేశాడు. ఆ రాత్రేకాదు, మళ్ళీ రమేష్ అయిపూ అంతూ లేదు. రావు చాలా ఆదుర్దా పడ్డాడు. ఆఫీసుకు వెళ్ళి వాకబుచేస్తే అతను అనారోగ్యకారణంగా నెలరోజులు సెలవు పెట్టినట్టు తెలిసింది. ప్రతిపూటా ఇంటికివెళ్ళి చూసినా వేసినతాళం వేసినట్టే ఉంది.

పదిరోజులు గడిచేటప్పటికి మాలతికి కూడా గాభరా వేసింది. అత నలా అదృశ్య మవడానికి తా నేమీ కారణం కాడుగదా అని భయపడింది. 'అతనిని గురించి తన కెందుకో ఆదుర్దా' అని తనకి తాను ఎంత నచ్చజెప్పుకున్నా



సమాధాన పడలేకపోయింది. అన్నయ్య స్నేహితుడని తప్పిస్తే నిజానికి ఆతని మీద తనకంత సదభిప్రాయంకూడా లేదు కదా !... అసలు తనకే కోపం రావలసిన పరిస్థితి, ఆరోజున అత నలా అన్నందుకు. ఎందుకో అలోచిస్తున్నకొద్దీ ఆతనిమీద అసహ్యం, కోపం తగ్గుతున్నాయి. తను ఉద్యోగరీత్యా అన్నయ్య దగ్గరకొచ్చి ఉంటున్న రెండేళ్ళుగా అతనిని తరుచూ చూస్తూనే ఉంది. ఎప్పుడో ఒకటిరెండు మాటలు తప్పిస్తే ఇద్దరూ ఎప్పుడు ఎక్కువ మాట్లాడుకున్నది లేదు. బార్ నుంచివచ్చినప్పుడు మాత్రమేఅన్నయ్యా, అతనూ ఇంకా మిగతా స్నేహితులూ ముందుగదిలో బాగా సరదాగా మాట్లాడు కుంటున్నట్టుగా లోపలికి వినిపించేది.

స్నేహితు లందరిలోకీ అన్నయ్యకు అతనంటేనే ఎక్కువ అభిమానం ఉండడం వల్ల అస్తమానం అన్నయ్య అతనిని గురించే మాట్లాడడంవల్ల, ఇంట్లో తనకీ వదినకీ కూడా అతను తన ఇంట్లోని ఒక వ్యక్తే ననిపించేటంత సన్నిహితంగా మనసులో మెదిలేమాట వాస్తవం.

"తాగుడే కాకుండా, స్త్రీ వ్యసనం కూడా ఉన్నట్టు ఉంది. అందుకే భార్య అంత గోలపెడుతుంది'' అనేది వదిన. అది విన్నదగ్గరనుంచీ అతనంటే తనకి అసహ్యం ఏర్పడింది. ఎప్పుడైనా అతను ఎదురుపడినా చూసీ చూడనట్టు వెళ్ళిపోతుంది తాను. అతనూ చొరవ చేసుకుని పలకరించడు అల్లాంటి సమయాల్లో. అతనిని గురించి తేలికగా మాట్లాడితే ఎంతో బాధపడతాడని తను అతనిని గురించి ఎప్పుడూ మాట్లాడనే మాట్లాడదు. ఒక రోజున అన్నయ్య ఏడవలేక నవ్వుతూ, "మీ రమేష్ ఏ స్నేహితురాలింటికైనా తీసుకు వెళ్ళాడా, ఇంత సేపటికి ఇల్లు, నేను గుర్తుకొచ్చాం" అంటే, అన్నయ్య కెంత కోపంవచ్చింది! ఎంత బాధపడ్డాడు! "రమేష్‌కి స్నేహితులు, స్నేహితురాలు అన్నీ నేనే... అయినా చెడుపని చేయాలంటే రమేష్ నాకు నేర్పక్కర్లేదు, నేనే రమేష్‌కినేర్పాలి, నేర్చుకోడు గాని" అన్నాడు అన్నయ్య. మళ్ళా ఎప్పుడూ రమేష్‌ని గురించి వదిన అన్నయ్యతో అలా ఎప్పుడూ మాట్లాడలేదు. అయితే మనసులో వదినకి రమేష్‌మీద కాస్త అనుమానమే, అన్నయ్యని ఎప్పటికైనా చెడగొడతాడేమోనని. తనదగ్గరేమీ దాయడనీ, తనంటే ఎనలేని ప్రేమనీ వదినకి అన్నయ్యమీద ఎక్కడలేని నమ్మకమూ ఉండడంవల్ల రమేష్ పెద్ద సమస్య కాకుండా ఉండిపోయాడు. లేకపోతే అన్నయ్య రమేష్‌ల గాఢ స్నేహానికి వదిన ఎప్పుడో అడ్డుపెట్టి ఉండేది. అన్నయ్య వినకపోతే రోజూ రభస చేసేది.

ఇద్దరూ ఇంత స్నేహంగా ఉంటారు కదా ఒక్కనాడు రమేష్‌భార్య మనింటికి వచ్చేది కాదేం అనిపించేది తనకి. ఉండబట్టలేక ఒకరోజున వదినని అడిగేసింది తను. "ఎప్పుడోఒకసారి వచ్చిందావిడ. ముగ్గురు పిల్లలూ, ఎప్పుడూ ఏదో అనారోగ్యమే... దానికి తగ్గట్టు భర్తమీద తగని అనుమానం. అతని తాగుడు తను సుతరామూ ఓర్చుకోలేదు. ఆ విషయంలో ఎప్పుడూ ఇద్దరికీ రభసేనట... వేళకి ఆఫీసుకువెళ్ళీ, వేళకి తిరిగొచ్చి, తను చెప్పిన కూరగాయలూ, సరుకులూ తెచ్చిపడేసి తనేలోకం అన్నట్టుగా అక్షరాలా భర్త ఉండాలన్న కోర్కెఆవిడది. దానికి శుద్ధ వ్యతిరేకి ఆయన. ఒకరితో ఒకరు ఎప్పటికీ సరిపెట్టుకోలేకపోయారు... సరే. మీ అన్నయ్య స్నేహితుడ్నే వెనకేసుకొచ్చి ఆవిడ్ని విమర్శిస్తా

రనుకో... అసలు మీ అన్నయ్యంటే ఆవిడకి చాలా ఈర్ష్య, కోపం అందుకనే మీ అన్నయ్య ఆట్టే వాళ్ళింటికి వెళ్ళే వారు కాదు ఆయన మీ అన్నయ్యని చూడందే ఉండలేరు అందుకని మనింటికే వచ్చేవారు ఇద్దరూ కాలేజీ చదువంతా ఒకే రూమ్‌లో ఉండి చదివారట అందుకే ఇద్దరికీ అంత స్నేహం" అంటూ చెప్పుకొచ్చింది వదిన

అపును తనకీ గుర్తే కాలేజీనుంచి సెలవలకి ఇంటికి వచ్చినప్పుడల్లా రమేష్‌ని గురించే చెబుతూ ఉండేవాడు ఇంట్లో నిజానికి తనకి రమేష్‌ని గురించి స్వంత అభిప్రాయంఅంటూ ఏమీలేదు, అన్నయ్య మాటలు,వదిన మాటలు విని, అత నలా, ఇలా అనుకోవడం తప్పిస్తే అతనిని సరిగా పరకాయించికూడా తనెప్పుడూ చూడలేదు, తనని మాత్రం అత నెప్పుడు అంత పరీక్షగా చూసాడు కనుక ఒక వేళ ముందుగదిలో అనయ్య తనూ కలిసి తీయించుకున్న ఫోటోలో చూశాడేమో ! నిజానికి తనకీ అన్నయ్యకీ ఎంతపోలికో, తను పాంటు, షర్టు వేసుకుంటే అచ్చం అన్నయ్యలాగే ఉంటుంది అందరూ 'కవలలా' అని అడుగుతారు తనకంటె అన్నయ్య ఎనిమిదేళ్ళు పెద్దయినా, తన వయసులాగే కనపడతాడు అందుకే వదిన నవ్వుతూ, "ఇంకో రెండేళ్ళు పోతే నన్ను మీ భార్య నని ఎవరూ అనుకోరు. 'మీ అత్తగారా' అనిఅడుగుతారు'' అంటుంది అన్నయ్యతో

తనతో ఆఫీసులో పనిచేసే మిగతా మొగవాళ్ళకీ, రమేష్‌కీ ఎంతో తేడా కనపడుతుంది వాళ్ళంతా ఏదో నెపంతో తనతో మాట్లాడదానికి ఉబలాటపడుతున్నట్టుగా కనబడతారు, రోజూ తమ ఇంటికి వస్తున్నా, అతను తనని పలకరించా లనుకున్నట్టుగా కూడా కనబడడు. మరి అతని లోకమే లోకమో ' అతను చాలా గొప్పగా వ్రాస్తాడంటాడన్నయ్య . మరి కవులు, రచయితలు ప్రతి దానినీ నిశితంగా పరిశీలిస్తా రని అంటారే ' .. అతనిలో ఆ లక్షణా లేవీ కనపడవే... ఆ రోజునత నామాట అన్నరోజుకూడా చూడలేదు, ఏదో శూన్యంలోకి కేంద్రీకరించినట్టుగా ఉన్న చూపులు తప్పిస్తే... అలా అనడంలో అతని ఉద్దేశ మేమిటో? కనపడిన ఆడవాళ్ళందర్నీ అలా అనడం అతనికి అలవాటేమో ' అందుకే భార్య అంత అనుమాన పడేదేమో ! ఆలోచన లలా పోయేటప్పటికి అతనిమీద కలుగుతున్న కోపం, తరుగుతున్న అసహ్యం తిరిగీ విజృంభించాయి

"ఇదుగో మాలతీ రమేష్ 'ఎటర్నల్ లవర్స్'ని గురించి వ్రాసింది .. ఎంతసేపూ నవలలుకాని, పొయిట్రీ ఇష్టముండదా నీకు, చదవవు" అంటూ తెచ్చిచ్చాడు అన్న ఒక మాగజైన్

నిజానికి తనకి పొయిట్రీ మొదటి నుంచీ చదివే అలవాటు తక్కువ. ఇంటర్మీడియట్‌లో మైనర్ పోయమ్స్ చదివినప్పుడుమాత్రం, పొయిట్రీ అంటే తన కెంతో అభిమానంగా ఉండేది. పొయిట్రీలో ఎప్పుడూ తనకే ఫస్టుమార్కు వచ్చేది. తరవాత తరవాత అన్నయ్య అన్నట్టు నవలలు తప్పిస్తే, పొయిట్రీ చదవడమే మానేసింది. తప్పని సరిగా రమేష్ వ్రాసిన 'ఎటర్నల్ లవర్స్' చేతిలోకి తీసుకుంది. మొదటిసారి భావం చటుక్కున స్ఫురించలా... రెండవసారి జాగ్రత్తగా చదివింది. తమాషాగా ఉందనుకుంది... ఏవేవో ఆలోచనల్ని రేకెత్తించింది ఆ రచన. కాసే పయాక మూడవసారి చదివింది. అన్నయ్య స్నానంచేసి లోపలికొస్తూ "ఎలాఉంది" అన్నాడు.

"అద్భుతంగా ఉంది" అంది తను. మనసులోని మాట అప్రయత్నంగానే తన నోటినుంచి బయట కొచ్చింది.


"నేను చెప్పలేదూ బ్రహ్మాండంగా వ్రాస్తాడు వాడని" అని అన్నయ్య ఎంతో సంబరపడ్డాడు.

ఆ రోజంతా ఆఫీసులోకూడ రమేష్ రచనే మాలతి మనసులో మెదిలింది. ఒకనాటి తన అభిరుచి తిరిగి తలెత్తింది. పొయిట్రీ యిష్టంగా చదవడం మొదలు పెట్టింది. అన్న నడిగి తీసుకుని రమేష్ వ్రాసిన మరికొన్ని రచనలుకూడా చదివింది. కొన్ని కొన్ని మరీ ఒకటికి రెండు సార్లు చదవకుండా ఉండలేకపోయింది కొన్నింటిని ఎప్పటికీ మర్చిపోలేమో ననుకుంది కూడా... ఎంతో గాఢత, భావుకత నిండివున్న ఆ రచనలు చదివి ఊరికే ఉండలేకపోయింది. వాటిని ఆఫీసులో కొందరికి చదవమని ఇచ్చింది కూడా.

తననారోజు ఆ మాట అన్న రమేష్, అన్నయ్య నిత్యమూ చెప్పుకొచ్చేరమేష్, వదిన మాటల్లోని రమేష్; తను రెండే ళ్ళగా యధాలాపంగా చూసిన రమేష్, రచనల్లో రమేష్ — ఇంతమందీ కలిసి అనుక్షణమూ తనని ఉక్కిరి బిక్కిరి చేయడం మొదలు పెట్టారు. అతనిని గురించి మాట్లాడాలని, అతనిని గురించి వినాలని, అతలి రచనలను చదవా లనే ఉత్కంఠత రోజురోజుకూ ఎక్కువవు తోంది, 'వదినయినా వస్తే బావుండును ఈ ఆలోచనలన్నా తగ్గుతాయి' అను కుంది.

రావు ఎంతగా ఆదుర్దాపడ్డా నెల రోజులయినా రమేష్ జాడలేదు. రోజులు లెక్కపెట్టుకుంటూ, నెల అవగానే అతని ఆఫీసుకు వెళ్ళాడు రావు.

"ఇవాళ జాయిన్ అవాలి. ట్రాన్స్ ఫర్ కూడా అయింది. మళ్ళీ వారంలో రిలీవ్ కూడా కావాలి" అన్నాడు ఆఫీసులో నిరుత్సాహంతో వెనక్కు తిరిగిన రావుకి రమేష్ ప్రత్యక్షమయ్యాడు. రావు



అమాంతం రమేష్‌ని పట్టుకుని బయటకు లాక్కుపోయాడు.

"ఆరోగ్యం బాగాలేదని సెలవుపెట్టి ఎక్కడికి చెప్పాపెట్టకుండా పోయావ్... నాతో మాటమాత్రంగా కూడా అనలేదే" అన్నాడు రావు.

"ఏమీ తోచలేదు. అట్లా అని పెడితే త్వరగా సెలవు దొరుకుతుంది కదా అని పెట్టాను. మా అత్తవారి ఊరు వెళ్ళి పిల్లల్ని చూచి, అక్కడా ఇక్కడా ఊరికే తిరిగివచ్చాను ఇంతకు క్రితమే" అన్నాడు తాపీగా రమేష్.

"నిజం చెప్పు...ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నం చేసుకున్నావుకదూ నువ్వు?"

కాసే పూరుకుండి, "ట్రాన్స్‌ఫర్‌కి కోరుకున్నమాట వాస్తవమే...అయితే

ఏ ప్రయత్నమూ చేయలేదు. అలాంటివి చేయగలఓపిక నాకులేదని నీకు తెలుసు" అన్నాడు రమేష్ ఎటో చూస్తూ.

"ఈ ఊరిలో ఉండడం ఇంత అకస్మాత్తుగ ఎందుకిష్టం గాకుండా పోయింది ?"

"ఇల్లు మారిస్తే కొంత మర్చిపోవచ్చు ననుకున్నాను.....కాని అదీ సాధ్యం కాలేదు. ఊరు మారిస్తే కొంత ఒంటరితనం తగ్గుతుందేమో నన్న ఆశ."

అది విని రావు ఇక మాట్లాడలేక పోయాడు. కాని ఆ రోజు టీ తాగకుండా అలా వదిలేసి ఎందుకు వెళ్ళిపోయాడనేది మనసులో అలాగే ఉండిపోయింది. తన కిష్టం ఉన్నా లేకపోయినా మర్యాదకోసం, మొహమాటపడి ప్రవర్తించే మనిషి ఆ రోజు మాలతి టీ ఇస్తే తాగకుండా ఎందుకు వెళ్ళిపోయి ఉంటాడు ?...ఏదో బలమైన కారణం ఉండి తీరుతుంది అనుకున్నాడు. అకారణంగానే తనతో చెప్పకుండా కూడా ఊరువెళ్ళిపోయి ఉంటాడు అని నిర్ధారించుకున్నాడు రావు.

కాసేపు తటపటాయించి, "మాలతి నువ్వు వ్రాసినవి చదివింది....తనకు చాలా నచ్చాయి" అన్నాడు.

మాలతిపేరు వినగానే కొంచెంగా గాభరాపడ్డాడు రమేష్. అయితే పైకి దానిని తెలియనీయలేదు రావు ప్రత్యేకంగా అలా చెప్పడంలో ఉద్దేశ్యమేమిటో అవగాహన కాలేదు. తనారోజున అన్న మాట మాలతి రావుతో చెప్పిందో లేదో కూడ పోల్చుకోలేకపోయాడు.

"ఆరోజున నువ్వు టీ కూడా త్రాగకుండా వెళ్ళిపోయావని నొచ్చుకుంది మాలతి" అన్నాడు మళ్ళీరావు.

ఈ సారి రమేష్, రావు ముఖంలోకి పరిశీలనగ చూశాడు. అయితే తనకు కావలసిన సంగతి అంతుచిక్కలా.

అప్పటికీ రమేష్ ఏమీ మాట్లాడక పోవడం చూచి, "రమేష్. నిజం చెప్పు మాలతి పొరపాటున నిన్నేమయినా కించపఱచిందా ఆరోజు" అన్నాడు రావు.

"లేదు....నేనే ఆవిడ్ని కించపఱచాను...ఆరోజు నే నలా అని ఉండాల్సింది కాదు" అన్నాడు రమేష్ తలదించుకుని.

"అలా ఏమీ చెప్పలేదే నాకు మాలతి. మాలతి నిన్నేమీ అనకపోతే బాధలేదు. నువ్వెవరినీ కించపరచవని నాకు తెలుసు. ఇవాళ నన్నేమీ తప్పించుకోలేవు. సాయంత్రం బుద్ధిగా ఇంటికొస్తానంటే సరే; లేకపోతే మా ఆఫీసువాళ్ళకి ఇక్కడినుంచే ఫోనుచేసి సెలవుపెట్టి, నీతోపాటు ఉండి తీసుకుపోతాను" అన్నాడు రావు.

సాయంత్రం తప్పకుండా వస్తానని చెప్పి రావుని ఒప్పించి పంపేశాడు రమేష్.

ఆఫీసులో కూర్చున్నాడన్నమాటే కాని ఎన్నడూ లేని అశాంతితో బాధ

పడ్డాడు రమేష్...భార్యా పోవడం, ఎన్నడూ విడిచివుండని ముగ్గురు పిల్లల్ని తన అత్తవారు పెంచటానికి తీసుకుపోవడం, శూన్యంగా పరిహసించే ఇల్లు, బంధాలన్నీ ఒక్కటొక్కటే తెగిపోవడం...రావుతో తనకున్న స్నేహబంధాన్ని కూడా తెంచేసుకుని అతి ఒంటరిగా ఎక్కడికైనా పారిపోదామనే వెర్రి ఆకాంక్ష.. తనమీద తనకే తెలియని కసి...ఆ పరిస్థితుల్లో అనుకోకుండ మాలతి టిఫిన్ పెట్టడం...రావు పోలికలు కొట్టొచ్చినట్టుగా కనపడే మాలతి తననలా ఆదరించడం...తిరిగి జీవితంలో ఏదో ఆశ...క్రొత్తబంధాల్ని కొనితెచ్చుకుందామనే ఆవేశం, ఆరోజున తన నలా అనేటట్లు చేశాయి...అయితే మరుక్షణమే తనలా అనకుండా ఉండిఉంటే బావుండేదని, ఆలా అనడం మాలతికి నచ్చిఉండదని అనిపించింది. అంతే...తిరిగి తన మామూలు జీవితంలోకి వెళ్ళిపోయాడు. బార్‌కి వెళ్ళాడు. బాగా తాగేశాడు. ఆఫీసుకు సెలవుపెట్టాడు. ఊరు విడిచి వెళ్ళిపోయాడు. అయితే ఎంతగా తానాలోచించుకున్నా 'అలా అని ఉండాల్సిందికాదు' అనిపించిందే తప్ప, తను అనగూడని మాట అన్నట్టుగా పశ్చాత్తాపం మాత్రం కలగడంలేదు. ఆక్షణాన మాలతిపట్ల తన కాభావం నిజంగా ఉంది. అది దాచుకోలేకపోయాడు. ఆ ఒంటరితనంలో, జివితంనుంచి భయపడి పారిపోదామనుకున్న ఆ తరుణంలో మాలతి తన కొక క్రొత్త జీవితాన్ని అందివ్వగలదన్న ఆశ రేగింది. మాలతి రావుల్ని విడిపడం తనాలోచించలేదు. రావుకు తనపట్ల ఉన్న ఆత్మీయతనే మాలతిలో కూడ తాను పొందగలిగితే బావుండు ననుకున్నాడు.

సాయంత్రం ఆఫీసు ముగిసేవేళ ముందే రావు రాకపోతే బహుశా రమేష్ రావు ఇంటికి వెళ్ళివుండేవాడు కాదేమో!

మాలతి ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పటికి, ముందుగదిలో సిగరెట్ తాగుతూ, టేబుల్‌మీద తనదీ, అన్నదీ కలిసిఉన్న ఫోటోను చూస్తూ కూర్చుని ఉన్న రమేష్‌ని చూడగానే తెల్లబోయింది. రమేష్‌కూడా మాలతి నలా చూడవలసివస్తుందని అనుకోలేదు. తనూ తెల్లబోయి లేవబోయాడు.

మాలతి ఇంతలో తేరుకుని "కూర్చోండి ... ఎప్పుడొచ్చారు" అంటూ ఎదురుగా సోఫాలో కూర్చుంది.

"ఇవాళే...మనల్నందర్నీ వదిలేసి పారిపోదామనుకుంటుండగా పట్టుబడ్డాడు నాకు" అంటూ రమేష్ లోపలినుంచి బిస్కెట్లప్లేటుతో వచ్చాడు.

"ఇప్పుడే టీ జేసుకొస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది మాలతి. టీ చేస్తోందన్న మాటేగాని, రమేష్‌పట్ల తానేదో మహాపరాధం చేసినట్టుగా బాధ పడుతోంది. 'నిజానికి ఏమయినా అపరాధం చేస్తే, రమేష్ చేశాడు కాని నేనేమి చేశాను' అనుకుంది... కాని పూర్తిగా

చేతులు దులిపేసుకోలేక పోయింది. పూర్తిగా తెరిపిన పడలేక పోయింది. ఆరోజు అత నన్న మాటను మౌనం సమాధానం కాదనుకుంది. కోపమో, ఇష్టమో రెంటిలో ఏదో ఒక టవ్వాలి. అయితే ఏదీ నిర్ధారణ చేసుకోలేక పోయింది. ఆ మాట తలుచుకుంటే అప్పుడప్పుడు కోపం వచ్చిన మాట వాస్తవమే... అయితే అది ఎక్కువ సేపు నిలవ లేదు. ప్రక్కనే అన్న అతని నామస్మరణే చేస్తూ, అత నేమయి పోయాడో నని బాధపడుతుంటే తనకే నెమ్మది నెమ్మదిగా అతనిమీద సానుభూతి తనకు తెలియకుండానే తనలో పాదుకుపోయింది.

కాని ఏ ఆడవాళ్ళని చూసినా అత నలాగే అంటాడేమో నన్న భావన వచ్చే టప్పటికి మళ్ళీ కోపం ముంచుకొచ్చింది. కాని ఆ అన్న ధోరణీ, మనిషి పద్ధతీ చూస్తే అలా వెకిలిగా అనిపించడంలేదు. అతని రచనల్లో అంతుదొరకని అగాధలే ఆ క్షణంలోనూ తనకి స్ఫురించింది. అన్నయ్య ఒకనాడు వదినతో ఆడవాళ్ళ విషయంలో అతనిని గురించి అన్న మాటలే నిజమేమో ! అతని భార్యకు, వదినకంటే అన్నయ్యకే అతనిని గురించి బాగా తెలుసు. అందరికంటె అన్నయ్యకే అతనంటే ఆత్మీయత ఎక్కువ. అందుకే అన్నయ్యకు అతనంతగా అర్ధమయ్యాడు. తనలోనూ ఆ ఆత్మీయతే నెలకొంటే... అంతకుమించి ఇక ఆలోచించ లేక పోయింది. టీ కప్పులు తీసుకుని ముందు గదిలోకి వెళ్ళింది.

రావు అక్కడ గేటులో ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"ఛీ ఇవాళైనా తాగుతారా" అంది మాలతి కొంచెంగా నవ్వుతూ.

రమేష్ తలెత్తి చూశాడు మాలతి ముఖంలోకి. ఏదో ధైర్యం వచ్చింది.

"మీకు నేను తాగడం ఇష్టమయితే" అన్నాడు టీ కప్పు అందుకుంటూ.

"ఏమి టటు చూస్తున్నారు. అక్కడేమీ శూన్యంలేదే ? నాదీ అన్నయ్యదీ ఫోటో అది" అంటూ కూర్చుంది మాలతి మరోకప్పు పెదవులకు చేర్చు కుంటూ.

ఏదో పూర్తిగా అర్ధ మయినట్టుగా మాలతి ముఖంలోకి చూస్తూ,

"అవును ఎక్కడా శూన్యంలేదు. నా మనసులోనూ లేదు. నిండుగా ఉన్నారు నాలో మీ రిద్దరూ ... పూర్వం అన్నీ శూన్యంగానే కనపడేవి, ఇప్పుడంతా నిండుగా, స్థూలంగా కనిపిస్తోంది" అన్నాడు రమేష్.

"హమ్మయ్యా ! వదిలాడు బాబూ ఆయన. ఎంతకీ కదలడే కబుర్లేసి" అంటూ లోపలికొచ్చిన రావు, క్రొత్త జీవం పోసుకున్నట్టుగా ఉన్న రమేష్ ముఖాన్ని ! క్రొత్త ఆనందంతో వెలుగుతున్న మాలతి ముఖాన్ని మార్చి మార్చి చూస్తూ ఎంతో తృప్తిగా బల్లమీద టీ కప్పు అందుకున్నాడు. ★